www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

మహిళపై లైంగిక వేధింపులు..



3 లో..

బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం



4 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 277, శుక్రవారం 6-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

ఫ్యూచర్ సిటీలో
గ్లోబల్ సమ్మిట్‌కు పక్కా ఏర్పాట్లు!

ప్రతి ప్రతినిధికి ప్రత్యేక లైజనింగ్ అధికారి..

భద్రతకు అత్యంత ప్రాధాన్యత

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026

నవంబర్ 15లోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం ఆదేశం



హైదరాబాద్, నవంబర్ 5 :

తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ప్రత్యేకంగా ఒక లైజనింగ్ అధికారిని నియమించాలని సీఎం సూచించారు.

తెలంగాణ పర్యాటక రంగానికి ప్రాధాన్యత

విమానాశ్రయానికి ప్రతినిధులు చేరుకున్న వెంటనే రిజిస్ట్రేషన్, పాస్‌ల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని సమావేశానికి ముందుగానే వారికి అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించాలని స్పష్టం చేశారు. ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారితో పాటు భద్రతా అధికారిని నియమించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమ్మిట్ నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

ముఖ్యమంత్రులను ఆహ్వానించాలి

తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలను అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేసేలా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. పర్యాటక రంగానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేలా సమ్మిట్‌లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని పేర్కొన్నారు. వాతావరణ మార్పులపై గ్లోబల్ సమ్మిట్‌లో ప్రత్యేక చర్చ జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

తెలంగాణ విద్యా రంగ ప్రగతిని నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ స్థాయి వరకు ప్రతిబింబించేలా విద్యా వ్యవస్థపై సమ్మిట్‌లో చర్చలు ఉండాలని ఆకాంక్షించారు. గ్లోబల్ సమ్మిట్‌కు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించాలని సీఎం సూచించారు. నవంబర్ 15వ తేదీలోగా సమ్మిట్‌కు సంబంధించిన సమగ్ర ఏర్పాట్ల ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు గడువు విధించారు. తెలంగాణ ప్రతిష్టను ప్రపంచ వేదికపై మరింత ..మిగతా 2లో



బీసీ సంఘాలకు రేవంత్ సర్కార్

గుడ్ న్యూస్

ఆత్మగౌరవ భవనాలకు భారీగా నిధులు

హైదరాబాద్‌లో 38 బీసీ కుల సంఘాల భవనాలకు నిధులు

ఆత్మగౌరవ భవనాల నిర్మాణం కోసం రూ. 88.50 కోట్లు మంజూరు

హైదరాబాద్, నవంబర్ 5

వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో 38 బీసీ కుల సంఘాల కోసం 'ఆత్మగౌరవ భవనాల' నిర్మాణానికి రూ. 88.50 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) పత్రాలను అందజేశారు. అన్ని కులాల సామాజిక, సాంస్కృతిక, విద్యాభివృద్ధి లక్ష్యంగా ఈ భవనాల నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు.

తెలంగాణ క్యాబినెట్ నిర్ణయాలు



హైదరాబాద్, నవంబర్ 5 ::

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో ఇప్పటివరకు ఉమ్మడిగా ఉన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్లను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆయా వర్గాలకు సంబంధించిన సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించడంతో పాటు, ప్రత్యేకంగా సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

1. దీపావళి సందర్భంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 2,25,000 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయింది. నిర్మాణం పూర్తయిన అన్ని ఇళ్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

2. నవంబర్ 7 నుంచి 9 వరకు కొడంగల్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారు. నవంబర్ 9న కొడంగల్‌లో భారీ రైతు బహిరంగ సభ నిర్వహిస్తారు. ఈ సభలో ముఖ్యమంత్రి, మంత్రులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొంటారు.

3. నవంబర్ 19న మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని సిద్దిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తాం. అదే రోజు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభిస్తాం. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తాం.



ప్రయాణికులకు గుడ్ న్యూస్

సగానికి పైగా తగ్గనున్న మెట్రో-ఆర్టీసీ కామన్ పాస్ ధరలు!

హైదరాబాద్ మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్ ధరలను తగ్గించనున్న తెలంగాణ ప్రభుత్వం

ప్రస్తుత ధరలు అధికంగా ఉన్నాయన్న ఫీడ్‌బ్యాక్‌తో ఈ నిర్ణయం

రోజువారీ పాస్‌ను రూ.400 నుంచి రూ.325కి తగ్గించే అవకాశం

నెలవారీ పాస్‌ను రూ.8,500 నుంచి రూ.4,000-4,500 మధ్యకు తగ్గింపు

దీపావళి నుంచి సవరించిన కొత్త ధరలు అమల్లోకి వస్తాయని అంచనా

హైదరాబాద్, నవంబర్ 5

హైదరాబాద్ నగర ప్రయాణికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఇటీవల ప్రవేశపెట్టిన కామన్ పాస్ ధరలను భారీగా తగ్గించాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు చాలా అధికంగా ఉన్నాయని ప్రయాణికుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టింది. సవరించిన ధరలు దీపావళి నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ఈ కామన్ పాస్ ధరలు ప్రయాణికులకు భారంగా మారాయి. రోజువారీ పాస్ కోసం రూ.400, నెలవారీ పాస్ కోసం ఏకంగా రూ.8,500 చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఈ పాస్‌పై ప్రజల నుంచి ఆశించిన స్పందన రాలేదు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు, ధరలను సవరించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తాజా నివేదికల ప్రకారం రోజువారీ పాస్ ధరను రూ.400 నుంచి రూ.325కు తగ్గించనున్నారు. అదేవిధంగా, నెలవారీ పాస్ ధరను రూ.8,500 నుంచి సుమారు రూ.4,000 – రూ.4,500 మధ్యకు తీసుకురావాలని భావిస్తున్నారు.

'ఆర్ఆర్ ట్యాక్స్'
నిజమే అయితే చర్యలేవి?

మోదీ, షాలకు కేటీఆర్ ప్రశ్న

ఆర్ఆర్ ట్యాక్స్‌పై కేటీఆర్ మరోసారి విమర్శలు

చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణ

బిల్డర్లు, డెవలపర్లకు విషయం తెలుసన్న కేటీఆర్

విమర్శలు చేస్తున్న కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్న

బీజేపీ-కాంగ్రెస్ మధ్య అవగాహన ఉందని ఆరోపణ

హైదరాబాద్, నవంబర్ 5



తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేతలు ఆరోపణలు చేస్తున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు.

తన ఎక్స్ పోస్టులో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు ..మిగతా 2లో

చర్చకు సిద్ధం

రాహుల్‌కు అమిత్ షా సవాల్..

ప్రధానికి అధికారికంగా లేఖ రాయాలని సూచన

ఎస్ఐఆర్, ఈవీఎంలు, చొరబాటుదారులపై చర్చకు రెడీ..

ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకూ సై



హైదరాబాద్, నవంబర్ 5

ఎస్ఐఆర్, ఈవీఎంల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ చర్చకు రావాలంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. రాహుల్‌కు నిజంగానే చర్చించాలనే చిత్తశుద్ధి, ధైర్యం ఉంటే ప్రధానమంత్రికి అధికారికంగా లేఖ రాయాలని సూచించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలు, చొరబాటుదారుల అంశాలపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

రాహుల్‌పై అమిత్ షా విమర్శలు

హరియాణాలోని కర్నాల్‌లో బీజేపీ నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో, అరాజకత హఠావో' యాత్రలో అమిత్ షా ప్రసంగించారు. పార్లమెంట్‌ను సజావుగా నడవనివ్వకుండా బయట రాజ్యాంగ పుస్తకాన్ని ..మిగతా 2లో

కాంగ్రెస్‌లో సద్దుమణగని విభేదాలు!

దామోదర వర్సెస్ లక్ష్మీకాంతారావు వివాదానికి తెరదించలేకపోయిన పీసీసీ చీఫ్.. గాంధీభవన్ సమావేశానికి మంత్రి డుమ్మా.. ఎమ్మెల్యేతో భేటీ

కాకుండానే వెనుదిరిగిన మహేశ్ గౌడ్

హైదరాబాద్, నవంబర్ 5



సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడి నియామకంపై స్థానిక మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మధ్య వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. వారి మధ్య వివాదాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నించిన పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ప్రయత్నం విఫలమైంది. ఈ విషయమై చర్చించేందుకు ఇద్దరు నేతలను గాంధీ భవన్‌కు రావాల్సిందిగా ఆదేశించారు. ఉదయం మంత్రితో, మధ్యాహ్నం ఎమ్మెల్యేతో మాట్లాడాలని నిర్ణయించారు. అసలు ఏం జరిగింది.. పరిష్కార మార్గం ఏంటి అనే దానిపై ఇద్దరితో విడివిడిగా మాట్లాడాలని ..మిగతా 3లో

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Follow : @bhadradrinews
శుక్రవారం
6 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

పాగుంట వెంకన్న జాతరకు వేళాయే!

పది రోజుల పాటు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు

నవంబర్ 7 నుంచి ఉత్సవాలు ప్రారంభం

10న స్వామివారి రథోత్సవం

తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక నుంచి తరలిరానున్న భక్తులు



జోగుళాంబ గద్వాల , నవంబర్ 5:

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు పాగుంట శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు వేళైంది. కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో కొలువుదీరిన స్వామివారి జాతరకు ఆలయ ప్రాంగణం ముస్తాబైంది. నవంబర్ 7 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు పది రోజుల పాటు వైభవంగా కొనసాగనున్నాయి. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోనున్నారు.

కల్యాణోత్సవం.. రథోత్సవం ప్రత్యేక ఆకర్షణ

శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నవంబర్ 7న శనివారం అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నవంబర్ 8న ఆదివారం సుప్రభాత సేవ, ధ్వజారోహణం, విష్ణు సహస్రనామ పారాయణం జరగనున్నాయి. నవంబర్ 9న సోమవారం ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, సాయంత్రం 6 గంటలకు ప్రభోత్సవం నిర్వహిస్తారు. నవంబర్ 10న మంగళవారం సాయంత్రం 7 గంటలకు శ్రీస్వామివారి రథోత్సవం భక్తిశ్రద్ధలతో జరగనుంది. నవంబర్ 11న బుధవారం సుప్రభాత సేవ, నిత్యహోమం, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, పల్లకీ సేవతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పురేందర్ తెలిపారు.





జాతర మైదానంలో సందడే సందడి

జాతరను పురస్కరించుకుని ఆలయ పరిసరాల్లో ఇప్పటికే వివిధ రకాల దుకాణాలు వెలిశాయి. పిల్లల కోసం జాయింట్ వీల్, బ్రేక్‌డ్యాన్స్ తదితర వినోద కార్యక్రమాలతో ఆటల ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు దాసంగాలు సమర్పించేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నారు. అమావాస్య సందర్భంగా నిర్వహించే స్వామివారి కల్యాణోత్సవానికి భారీగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది.

భక్తులకు అన్ని ఏర్పాట్లు

భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈఓ పురేందర్ ఆధ్వర్యంలో తాగునీరు, మౌలిక వసతులు, క్యూ లైన్లు, షామియానాలు ఏర్పాటు చేశారు.ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీతో పాటు రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాయి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గద్వాల డీఎస్పీ వై.మొగులయ్య సూచనల మేరకు గద్వాల సీఐ టి.శ్రీను, కేటిదొడ్డి ఎస్ఐ పి.శ్రీనివాసులు పర్యవేక్షణలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

వివేకానంద నగర్‌లో శ్రీలక్ష్మి చిన్నారుల వైద్య, క్యాన్సర్ చికిత్స కేంద్రం ప్రారంభం

కాలనీవాసులకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలి:రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి

కూకట్ పల్లి, నవంబర్ 5

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ వీధి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మి చిన్నారుల వైద్య, క్యాన్సర్ చికిత్స కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఉదయం 10.30 గంటలకు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమ్యవర్ధిని సమక్షంలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి, కార్యదర్శి రాంచందర్ రావు, కమిటీ సభ్యులు పాల్గొని వైద్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమ్యవర్ధినిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాలనీవాసులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైద్యులు కాలనీవాసులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ చిన్నారులకు, ఇతర రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు, తగిన చికిత్స అందించాలని కోరారు. ఈ వైద్య కేంద్రం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ మరింత మందికి వైద్య సేవలు అందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ వైద్యులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో సహకరించిన కమిటీ సభ్యుడు పి. సూర్య నారాయణకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు జి. ప్రసాద్, టైగర్ పురుషోత్తం, లక్ష్మీనారాయణ, మూర్తి, వెంకటేశ్వరరావు, జి. నర్సింగరావు, కిషోర్, భాస్కర్, శ్రీనివాస్ తదితరులతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి. సూర్యనారాయణ కార్యక్రమానికి హాజరైన కాలనీవాసులకు, అసోసియేషన్ కమిటీ సభ్యులకు పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.



భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

- భూభారతి, జీవో 118, 59, యూఎల్‌సీ, 90-డి, 92 దరఖాస్తులపై ప్రత్యేక కార్యాచరణ

- నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

రంగారెడ్డి జిల్లా , నవంబర్ 5

జిల్లాలో భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు కిరణ్మయి, చంద్రా రెడ్డితో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూభారతి, జీవో 118, 59, యూఎల్‌సీ, 90-డి, 92 దరఖాస్తుల పరిష్కార పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి పోర్టల్ లో పెండింగ్ లో ఉన్న సుమారు 22 వేల దరఖాస్తులను నవంబర్ 15లోగా పరిష్కరించాలని, జీవో 118 దరఖాస్తులను వారం రోజుల్లో, జీవో 59, 92 దరఖాస్తులను 15 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. యూఎల్‌సీకి సంబంధించి జీవో 455, 456, 740 కింద ఉన్న మాన్యువల్ దరఖాస్తులను రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా పరిష్కరించాలని సూచించారు. భూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, గ్రామసభలకు వారం రోజుల ముందుగానే నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. అటవీ, రోడ్లు భవనాలు, ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన భూముల వివరాలను సేకరించి, ఆయా శాఖల అధికారుల సమక్షంలో సరిహద్దులను నిర్ధారించాలని, వారి అభిప్రాయాలు, సంతకాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు.గ్రామసభల నిర్వహణలో నిర్దేశిత ఎస్ఓపీని తప్పనిసరిగా పాటించాలని, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి హాజరు కావాలని, సమావేశ మినిట్స్‌ను అధికారిక రిజిస్టర్లలో నమోదు చేసి హాజరైన వారి సంతకాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రీ-సర్వేకు సంబంధించిన 13 ఫార్మాట్లను సక్రమంగా నిర్వహిస్తూ, సర్వే బౌండరీస్ యాక్ట్--1923, తెలంగాణ భూభారతి చట్టం--2024 నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.ప్రభుత్వ, రిజర్వ్, ఇతర శాఖల భూముల విషయంలో క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని, నోటీసుల జారీ, సరిహద్దుల నిర్ధారణ, గ్రామసభ మినిట్స్ సహా అన్ని రికార్డులను భద్రపరచాలని కలెక్టర్ ఆదేశించారు. తప్పుడు నివేదికలు సమర్పించడం, రికార్డుల తారుమారు, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే సంబంధిత అధికారులపై కఠిన శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు డాక్టర్ , చంద్రారెడ్డి, ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ రాంరెడ్డి, డిఆర్ఓ శారదా దేవి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లు, యూఎల్‌సీ విభాగం అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, గ్రామపాలన అధికారులు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



భూ రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి

రంగారెడ్డి జిల్లా :

భూ రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం అవుతుందని అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి అన్నారు. గురువారంభూ భారతి కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం మనోరాబాద్ గ్రామంలో గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి అధ్యక్షతన భూ రీసర్వే గ్రామసభ , అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... భూ రికార్డులను ఆధునికీకరించడం, భూముల కొలతల్లో ఖచ్చితత్వాన్ని పెంపొందించడం, భూ సరిహద్దు వివాదాలను పరిష్కరించడం, భూ యజమానుల హక్కులను స్పష్టంగా నిర్ధారించడం భూ రీసర్వే ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఆధునిక డిజిపిఎస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భూములను అత్యంత ఖచ్చితత్వంతో సర్వే చేసి, డిజిటల్ భూ రికార్డులను రూపొందించడం జరుగుతుందని వివరించారు. రీసర్వే ద్వారా భూముల సరిహద్దులను స్పష్టంగా గుర్తించడం వల్ల రైతుల మధ్య భూ వివాదాలు తగ్గుతాయని, భూముల విస్తీర్ణాన్ని కచ్చితంగా నిర్ధారించడంతో పాటు పాత భూ రికార్డులను డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావచ్చని పేర్కొన్నారు.అలాగే భూ యాజమాన్య హక్కుల స్పష్టత, ప్రభుత్వ , ప్రైవేటు భూముల ఆక్రమణల గుర్తింపు, భూముల సబ్‌డివిజన్ వివరాల నమోదు వంటి ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. ఖచ్చితమైన భూ రికార్డులు అందుబాటులో ఉండటం వల్ల రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంతో పాటు బ్యాంకు రుణాలు పొందేందుకు సైతం సౌలభ్యం కలుగుతుందని వివరించారు. రీసర్వే పూర్తయిన అనంతరం నిబంధనల ప్రకారం కొత్త భూ రికార్డులు, పట్టా వివరాలను డిజిటల్ విధానంలో పొందుపరచడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు మనోరాబాద్ గ్రామ భూ వివరాలను గ్రామసభలో వెల్లడించారు. గ్రామ మొత్తం భౌగోళిక విస్తీర్ణం 288 ఎకరాల 07 గుంటలు కాగా, మొత్తం 48 సర్వే నంబర్లు ఉన్నాయి. ఇందులో పట్టా భూమి 267 ఎకరాల 16 గుంటలు, ప్రభుత్వ భూమి 18 ఎకరాల 35 గుంటలుగా వివరించారు. ప్రభుత్వ భూముల్లో ఎండోమెంట్ భూమి 3 ఎకరాలు, ప్రభుత్వ భూమి 10 ఎకరాల 05 గుంటలు, లావణ్య పట్టా భూమి 5 ఎకరాల 30 గుంటలుగా గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా రీసర్వే చేయవలసిన సబ్‌డివిజన్ నంబర్లు 388 ఉన్నట్లు వెల్లడించారు.భూ రీసర్వే ప్రక్రియలో రైతులందరూ చురుకుగా భాగస్వాములై అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. రైతులు తమ భూములకు సంబంధించిన పాత రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్‌లు, ఇతర సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, సర్వే సమయంలో తమ భూముల సరిహద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించుకోవాలని కోరారు. పారదర్శకమైన, ఖచ్చితమైన డిజిటల్ భూ రికార్డుల వ్యవస్థ ఏర్పాటుకు భూ రీసర్వే ఎంతో దోహదపడుతుందని, దీనివల్ల భూ యజమానులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏ డి ఎస్ ఎల్ ఆర్ రామ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, మంచాల్ తహసీల్దార్ వి.ప్రసాద్ రావు, ఇబ్రహీంపట్నం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే డి.శ్రీనివాస్, మండల సర్వేయర్ ఎస్ వి ధనశ్రీ, మంచాల్ మండల లైసెన్స్ సర్వేయర్లు, గ్రామ పాలన అధికారి ఎన్. జంగయ్య, సర్పంచ్ ఏ సంజీవ రెడ్డి, మంచాల్ మండల సిబ్బంది , గ్రామ రైతులు పాల్గొన్నారు.





ఢిల్లీలో 'ఓట్ బచావో - దేశ్ బచావో' ర్యాలీని విజయవంతం చేసిన కూకట్‌పల్లి కాంగ్రెస్ నేతలు

సాధు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లి విజయవంతం

కూకట్‌పల్లి,నవంబర్ 2:

న్యూఢిల్లీ రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న నిర్వహించిన 'ఓట్ బచావో - దేశ్ బచావో' నిరసన ర్యాలీలో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాధు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీకి భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుల సంరక్షణ లక్ష్యంగా నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ ర్యాలీలోఢిల్లీలో జరిగిన ఈ నిరసన ర్యాలీలో కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు ఐకమత్యంతో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటానికి తమ సంఘీభావాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పి. నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, కూకట్‌పల్లి మాజీ పార్టీ అధ్యక్షులు ఎస్. సతీష్ రెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజీవరావు, కంటెస్టెడ్ కార్పొరేటర్లు విఠల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎం.డి. మోయిజ్, మాజీ ఏఎంసీ చైర్మన్ పుష్ప రెడ్డి, కొండల్ రెడ్డి, రాచమల్ల శేఖర్ గౌడ్, క్రిస్టియన్ మైనారిటీ నాయకులు మేకల మైకేల్, అబ్దుల్ బాకీ, రాజశేఖర్ రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్‌పుత్, ప్రవీణ్, సుంకన్న, అశోక్ ముదిరాజ్, గోవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్‌కు పక్కా ఏర్పాట్లు!

మొదటి పేజీ తరువాయి...

ఇనుమడింపజేసేలా గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో పండుగ చేసుకోండి

మరోవైపు దీపావళి వేళ ఇందిరమ్మ ఇంట్లో లబ్ధిదారులతో పండుగ జరుపుకుంటానని, లబ్ధిదారుల సొంతింటి సంతోషంలో పాలుపంచుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో పండుగ చేసుకోవాలని ఆదేశించారు.

చర్చకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి...

పట్టుకుని తిరిగితే సరిపోదని, ప్రవర్తన కూడా రాజ్యాంగబద్ధంగా ఉండాలని రాహుల్ గాంధీకి హితవు పలికారు. పార్లమెంట్‌లో చర్చలకు సహకరించకుండా వాకౌట్లు చేయడం, ఆందోళనలకు దిగడం కాంగ్రెస్ సంస్కృతిగా మారిందని విమర్శించారు. మృతుల పేర్లతో పాటు మూడు కోట్ల మంది బంగ్లాదేశ్ చొరబాటుదారులు, రోహింగ్యాల బోగస్ ఓట్లను ఎన్నికల సంఘం తొలగిస్తుంటే రాహుల్ గాంధీకి ఎందుకు అభ్యంతరమని ప్రశ్నించారు. చొరబాటుదారులే కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుగా ఉన్నారని, అందుకే ఓటర్ల జాబితా ప్రక్షాళనను అడ్డుకునేందుకు 'ఓట్ల చోరీ' అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. దేశ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని, చొరబాటుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తప్పనిసరిగా తొలగించాలని అమిత్ షా పేర్కొన్నారు.

పార్లమెంట్‌లో చర్చకు బదులు ఆందోళనలా?

ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ చర్చలకు అత్యున్నత వేదిక అని అమిత్ షా అన్నారు. అలాంటి వేదికలో కీలక అంశాలపై చర్చించకుండా కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. పార్లమెంట్‌ను పనిచేయనివ్వకుండా బయట వీధుల్లో ఆందోళనలు చేస్తూ అరాచకాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. 80 ఏళ్ల ప్రజాస్వామ్యం తమ మోసాలకు లొంగిపోతుందని కాంగ్రెస్ భావిస్తోందా అని ప్రశ్నించారు. పార్లమెంట్, శాసనసభలు, గ్రామాలు, పొలాల్లోనూ బీజేపీ కాంగ్రెస్‌కు తగిన సమాధానం ఇస్తుందని వ్యాఖ్యానించారు. ప్రజలను సమీకరించి ఆందోళనలు చేయాలని కాంగ్రెస్ భావిస్తే, ఎదుర్కొనేందుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' యాత్ర రాహుల్ గాంధీకి బలమైన సమాధానమని పేర్కొన్నారు.

'ఆర్ఆర్ ట్యాక్స్' నిజమే అయితే చర్యలేవి?

మొదటి పేజీ తరువాయి...

అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోదీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. అలాంటప్పుడు ఆ వసూళ్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు తరచూ వస్తున్న మోదీ, అమిత్ షాలు ఈ అంశంపై బహిరంగంగా విమర్శలు చేయడం తప్ప, తదుపరి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు.

ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అంతర్గత అవగాహన ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్యలకు ముందుకు రావడం లేదని విమర్శించారు. ఆరోపణలు చేయడం, రాజకీయంగా విమర్శలు గుప్పించడం తప్ప ఆ వసూళ్లపై విచారణ జరిపించేందుకు బీజేపీ నేతలు చొరవ చూపడం లేదని అన్నారు.

'ఆర్ఆర్ ట్యాక్స్' అంశంపై ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ ఆరోపణలను తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఖండించింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఈ అంశం రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది.

ఆదర్శ గ్రామ పంచాయతీగా “ఇల్లూరు” ఎంపిక..

- పీఎం ఏ జె ఏ వై ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ద ఆదర్శ గ్రామపంచాయతీగా ఇల్లూరు సెలెక్ట్
- కులమత రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్న సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి..
- ఇల్లూరు ఆదర్శ గ్రామంగా ఎంపిక కావడం పట్ల కృషి చేసిన కేంద్ర మాజీ మంత్రి ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుక సోదరికి కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్
- మధిర మండలంలో నెంబర్ వన్ గ్రామంగా ఇల్లూరును ఎంపిక చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచి గ్రామ ప్రజలు.





కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా గ్రామాల్లోని జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు పారిశుధ్య కార్యక్రమాలు ఇతర వాటిలి పరిగణలోకి తీసుకొని గ్రామపంచాయతీలను పీఎం ఏ జె ఏ వై ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ద ఆదర్శ గ్రామపంచాయతీలను ఎంపిక చేయటం జరిగింది దానిలో భాగంగా మధిర మండలం నుండి ఇల్లూరు గ్రామం ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి చేకూరి ఆదిలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయటం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ గ్రామంలోని కులమత రాజకీయాలకు అతీతంగా ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని భవిష్యత్తులో కూడా అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేపట్టి ఆదర్శ గ్రామంగా ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా ఆదర్శ గ్రామంగా ఎంపిక కావడం పట్ల కేంద్ర మాజీ మంత్రి ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి గారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మరియు సహకరించిన జిల్లా, మండల అధికారులకు సర్పంచి చేకూరి ఆదిలక్ష్మి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అమరవీరుల ఆశయ సాధనకు ఉద్యమ పోరాటాలను కొనసాగిద్దాం!

- త్యాగధనుల పోరాట స్ఫూర్తితో దోపిడీ, పీడన లేని సమాజ నిర్మాణమే లక్ష్యం
- ప్రజా ఉద్యమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
: సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వై. ప్రకాష్



కారేపల్లి, నవంబర్ 5 (భద్రాద్రి న్యూస్ రాములు): అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమ పోరాటాల్లో భాగస్వాములు కావాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కారేపల్లి మండల కార్యదర్శి వై. ప్రకాష్ పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నవంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న అమరవీరుల వర్ధంతి సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా గురువారం కారేపల్లి మండలం పేరుపల్లి గ్రామంలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత కామ్రేడ్ పెద్దబోయిన వెంకన్న స్థూపం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వై. ప్రకాష్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, దేశ విముక్తి కోసం తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. బూర్జువా, భూస్వామ్య దోపిడీకి, ప్రజావ్యతిరేక పాలకవర్గ విధానాలకు వ్యతిరేకంగా దున్నేవారికి భూమి కావాలనే నినాదంతో, కార్మిక రాజ్య స్థాపనే లక్ష్యంగా సాగిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని గుర్తుచేశారు. 1969 నుంచి గోదావరి లోయ ప్రతిఘటన పోరాటంలో సంద్ర పుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి, పోట్ల రామ నరసయ్య, నీలం రామచంద్రయ్య తదితర నాయకుల స్ఫూర్తితో వేలాది మంది వీరులు, వీరవనితలు ప్రజా విముక్తి కోసం ప్రాణత్యాగాలు చేశారని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 15 వేల మంది అమరులయ్యారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో భూమి, ప్రజల హక్కుల కోసం పోరాడి అమరులైన కామ్రేడ్లు బిక్కుమియా, హనుమంతరావు, బోళ్ల లింగన్న, పానుగంటి లక్ష్మారెడ్డి, మల్కం చంద్రయ్య, కొప్పుల గురుస్వామి, దినసరి సమ్మన్న, ముదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కోరం పొట్టయ్య, సంఘ రాములు తదితరులకు ఘనంగా జోహార్లు అర్పించారు. అమరవీరుల చిత్రపటాలకు, స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం మాత్రమే నిజమైన నివాళి కాదని, వారు ఆశించిన దోపిడీ, పీడన లేని సమాజ నిర్మాణం కోసం ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనడమే వారికి అందించే అసలైన నివాళి అని వై. ప్రకాష్ స్పష్టం చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధన దిశగా ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల నాయకులు కంచర్ల శ్రీనివాస్ రెడ్డి, అలం గురవయ్య, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి వై. జానకి, సుగుణ, చంద్రయ్య, వెంకన్న, సంపత్, కిషన్, రాందాస్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్మృతులకు ఘన నివాళి.. బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ నేతల భరోసా!

- మాజీ సర్పంచ్ బోడ మోహన్ కృష్ణ వర్ధంతి కార్యక్రమం.. మండేపూడి రాణి కుటుంబానికి నాయకుల పరామర్శ



సింగరేణి, నవంబర్ 5 (భద్రాద్రి న్యూస్ రాములు): సింగరేణి మండల కేంద్రానికి చెందిన గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ స్వర్గీయ బోడ మోహన్ కృష్ణ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఆయన కుమార్తె బోడ కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్‌గా ఆయన అందించిన సేవలను, గ్రామ అభివృద్ధిలో పోషించిన పాత్రను, ప్రజలతో ఆయనకున్న ఆత్మీయ అనుబంధాన్ని నాయకులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అదేవిధంగా కామేపల్లి మండలం ఉట్కూరు గ్రామంలో సింగరేణి మాజీ సర్పంచ్ మండేపూడి రాణి మాతృమూర్తి దశదిన కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, కష్టసుఖాల్లో అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ ఉన్నం వీరేందర్, మాజీ ఎంపీటీసీ రావూరి శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు డొంకెన రవీందర్, గడ్డం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ జడల వసంత కుమారుడు జడల కళ్యాణ్ యాదవ్, గంగారబోయిన మురళి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై లైంగిక వేధింపులు..

- నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష!
- రూ.10 వేల జరిమానా విధించిన ఖమ్మం న్యాయస్థానం..
సమర్థవంతమైన దర్యాప్తు చేసిన పోలీసు అధికారులకు అభినందనలు





కారేపల్లి, నవంబర్ 5 (భద్రాద్రి న్యూస్ రాములు): మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడటంతో పాటు బెదిరింపులకు గురిచేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఖమ్మం న్యాయస్థానం మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తు, న్యాయస్థానంలో పకడ్బందీగా ఆధారాల సమర్పణతో కేసులో నేరం నిరూపితమైంది. కారేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మేకలతండాకు చెందిన భూక్యా లచ్చిరాం (42)పై 2019లో క్రైమ్ నంబర్ 48/2019 కింద ఐపీసీ సెక్షన్లు 354, 506 ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళపై వేధింపులకు పాల్పడటంతో పాటు బెదిరింపులకు గురిచేసిన ఈ కేసులో పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి న్యాయస్థానంలో అవసరమైన ఆధారాలను సమర్పించారు. కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ఖమ్మం మూడవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఏ. ప్రవీణ్ కుమార్ నిందితుడు భూక్యా లచ్చిరాంకు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో మొదటి దర్యాప్తు అధికారిగా ఏఎస్ఐ బి. కృష్ణ ప్రసాద్, ప్రధాన దర్యాప్తు అధికారిగా పి. వెంకన్న సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి నేర నిరూపణకు అవసరమైన ఆధారాలను సేకరించారు. న్యాయస్థానంలో విచారణ సందర్భంగా పోలీసు అధికారులు సమన్వయంతో వ్యవహరించి కేసు నిరూపణకు తమ వంతు సహకారం అందించారు. కేసు విచారణలో సహకరించిన కోర్టు డ్యూటీ అధికారి సీహెచ్. నాగేశ్వరరావు, ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ గాయత్రి, బ్రీఫింగ్ అధికారి ఎస్సై బైరు గోపి, లైజన్ అధికారి ఎస్సై కె. శ్రీకాంత్‌లను అడిషనల్ డీసీపీ రామానుజం ప్రత్యేకంగా అభినందించారు. మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవనే విషయాన్ని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.

నర్సింగ్ రంగంలో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- సేవాభారతి కొత్తగూడెం బాధ్యులు, న్యాయవాది పాండురంగ విరల్



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 05 (భద్రాద్రి న్యూస్) : కొత్తగూడెం: సేవాభారతి తెలంగాణ ఆధ్వర్యంలో జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సులో 33వ బ్యాచ్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సేవాభారతి కొత్తగూడెం బాధ్యులు, న్యాయవాది పాండురంగ విరల్ తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన యువతకు నర్సింగ్, పేషెంట్ కేర్ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగు నెలల పాటు కొనసాగే ఈ కోర్సులో పేషెంట్ కేర్, ప్రాథమిక వైద్య సహాయం, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర అంశాల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఆసుపత్రులు, హెల్త్ కేర్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాల కోసం సహకారం అందించనున్నట్లు వివరించారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 19 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలతో పాటు కోర్సు పూర్తి చేసిన వారికి హెచ్ఎన్ఎస్సి సర్టిఫికెట్ అందజేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాది పాండురంగ విరల్ కోరారు. మరిన్ని వివరాలకు హైదరాబాద్‌లోని న్యూ బోయినపల్లి సేవాభారతి కార్యాలయాన్ని లేదా 9398312414, 9704387050 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రైతుల సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యం: అజ్మీర బిచ్చ నాయక్

- సింగరేణి మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా నియామకం..
రైతుల హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తా



సింగరేణి, నవంబర్ 5 (భద్రాద్రి న్యూస్ రాములు): సింగరేణి మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా అజ్మీర బిచ్చ నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మేకల మల్లేష్ యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అజ్మీర బిచ్చ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కిసాన్ మోర్చా మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు. మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి రైతుకు అందేలా అవగాహన కల్పిస్తానని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వారి పక్షాన నిలబడి, రైతు సంక్షేమం కోసం కిసాన్ మోర్చా తరపున నిరంతరం పోరాటం సాగిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు నరుకూరి వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు మేకల మల్లేష్ యాదవ్, మండల నాయకుడు నారాయణ, జిల్లా నాయకురాలు సుజాత తదితరులు పాల్గొని అజ్మీర బిచ్చ నాయక్‌కు అభినందనలు తెలిపారు.

బాణసంచా దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి

- అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు
- కామేపల్లి ఎస్సై పి.శ్రీకాంత్



కామేపల్లి, నవంబర్ 5(భద్రాద్రి న్యూస్): రానున్న దీపావళి పండుగను పురస్కరించుకుని కామేపల్లి మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో ఉన్న దుకాణాలు బాణసంచా (ఫైర్ క్రాకర్స్) దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతులు, లైసెన్సులు పొందాలని కామేపల్లి సబ్ ఇన్ స్పెక్టర్ (ఎస్సై) పి. శ్రీకాంత్ స్పష్టం చేశారు. అనుమతులు కలిగిన వ్యాపారులు మాత్రమే ప్రభుత్వం నిర్దేశించిన నిర్ణీత ప్రదేశాలలో, అగ్నిమాపక శాఖ భద్రతా ప్రమాణాలను పాటిస్తూ షాపులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే, పండుగను ఆసరాగా చేసుకుని బాణసంచాను నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా నిల్వ చేసినా, విక్రయాలు జరిపినా,లేదా అధిక ధరలకు అమ్మితే తమ దృష్టికి వచ్చిన దుకాణాలపై చట్టప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటామని స్పష్టం చేశారు. వ్యాపారులందరూ ఈ విషయాలను గమనించి, పోలీసు. అగ్నిమాపక శాఖా అధికారుల నియమ నిబంధనలకు కట్టుబడి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
శుక్రవారం
6 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

సర్పంచ్ సంతకం లేకుండానే ఇందిరమ్మ ఇళ్ల ప్రతిపాదనలా!

- గంగారంతండాలో ఇళ్ల ఎంపికపై వివాదం.. నిబంధనలకు విరుద్ధంగా ఏడు ఇళ్ల ప్రతిపాదనలు చేశారంటూ సర్పంచ్ కిరణ్ ఆరోపణ

- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు.. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



కారేపల్లి, నవంబర్ 5 (భద్రాద్రి న్యూస్ రాములు): నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాల్సిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ సింగరేణి మండలం గంగారంతండా సర్పంచ్ కిరణ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ సంతకం, అనుమతి లేకుండానే ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించిన ప్రతిపాదనలు అధికారులకు పంపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడిన గ్రామ సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా ఇళ్ల ఎంపిక ప్రక్రియ చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గంగారంతండాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం చోటుచేసుకుంటోందని, దీనివల్ల అర్హులైన పేద కుటుంబాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని సర్పంచ్ ఆరోపించారు. గ్రామసభ తీర్మానాలు పారదర్శకంగా జరగాల్సి ఉండగా, తన సంతకం లేకుండానే ఏడు ఇళ్లకు సంబంధించిన ప్రతిపాదనలు అధికారులకు పంపినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి వివరించడంతో పాటు జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన ఫిర్యాదు మేరకు ప్రత్యేక విచారణ అధికారి అశోక్ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారని, ప్రతిపాదించిన ఏడు ఇళ్లలో నాలుగు ఇళ్లకు ఇప్పటికే డాబాలు ఉన్నట్లు గుర్తించి వాటి ప్రతిపాదనలను తిరస్కరించినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం రాజకీయ పలుకుబడి ఉన్నవారికి కాకుండా నిజమైన నిరుపేదలకు అందాలని ఆయన స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, గ్రామస్థాయిలో పూర్తి పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన పేదలకు న్యాయం జరిగే వరకు తన పోరాటం కొనసాగిస్తానని, అవసరమైతే న్యాయపోరాటానికి సైతం వెనుకాడబోనని సర్పంచ్ కిరణ్ స్పష్టం చేశారు.

ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీవో సోమ్‌లాల్



కామేపల్లి, నవంబర్ 5(భద్రాద్రి న్యూస్): కామేపల్లి మండల పరిధిలోని బర్లగూడెం పంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (వీబీ-జీ రామ్ జీ) కింద చేపడుతున్న పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ధరావత్ సోమలాల్ గురువారం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించారు. ?మండలంలోని సర్వయకుంట, కొండారెడ్డి కుంట తదితర ప్రాంతాల్లో కూలీలు పెద్ద సంఖ్యలో నిర్వహిస్తున్న వివిధ పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పనుల ప్రగతిని అడిగి తెలుసుకుంటూ, కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి కావాలని, రికార్డులను ఎప్పటికప్పుడు సరిగ్గా నిర్వహించాలని అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.
?ఈ కార్యక్రమంలో బర్లగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ మాలోత్ కిషన్ నాయక్, పంచాయతీ కార్యదర్శి అజ్మీర రాంబాబు,ఉపాధి హామీ సిబ్బంది, మురామేస్త్రీలు స్థానిక కూలీలు తదితరులు పాల్గొన్నారు

కారేపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి కాసుల వర్షం!

- పశువుల సంత వేలంలో రూ.8.06 లక్షల ఆదాయం.. గతేడాదితో పోలిస్తే రూ.1.43 లక్షల అదనపు రాబడి

- నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లికి చెందిన దూదిపాల వెంకటేశ్వర్లుకు వేలం హక్కులు



కారేపల్లి, నవంబర్ 5 (భద్రాద్రి న్యూస్ రాములు): కారేపల్లి శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి పశువుల సంత వేలం ద్వారా ఈ ఏడాది భారీ ఆదాయం సమకూరింది. ప్రతి ఆదివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించే పశువుల సంత లైసెన్స్ హక్కుల కోసం గురువారం నిర్వహించిన సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలంలో దేవస్థానానికి గతేడాదితో పోలిస్తే గణనీయమైన అదనపు ఆదాయం లభించింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి పెదగోపాలాచార్యులు, మండల అధికారుల సమక్షంలో నిర్వహించిన వేలం పాటలో నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లికి చెందిన దూదిపాల వెంకటేశ్వర్లు రూ.8,06,000లకు వేలం హక్కులను దక్కించుకున్నారు. దీంతో రానున్న ఏడాది పాటు పశువుల సంత నిర్వహణ బాధ్యతలను ఆయన చేపట్టనున్నారు. గత ఏడాది పశువుల సంత వేలం రూ.6,63,000లకు జరగగా, ఈ ఏడాది రూ.8,06,000లకు చేరింది. దీంతో దేవస్థానానికి గతేడాదితో పోలిస్తే అదనంగా రూ.1,43,000 ఆదాయం సమకూరింది. వేలం ఆదాయం గణనీయంగా పెరగడం ఆలయ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ పశువుల సంతకు కారేపల్లితో పాటు పరిసర గ్రామాలు, వివిధ ప్రాంతాల నుంచి రైతులు, పశువుల కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. ఈ సంతకు ఉన్న ఆదరణే వేలం ఆదాయం పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచింది. వేలం ద్వారా సమకూరిన అదనపు ఆదాయం దేవస్థాన అభివృద్ధి, నిర్వహణ కార్యక్రమాలకు మరింత దోహదపడనుంది. ఈ వేలం కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ), పంచాయతీ కార్యదర్శి నెహ్రూ, ఆలయ సిబ్బంది,మూడ్ మోహన్,అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుతోనే పర్యావరణ పరిరక్షణ

- టీజీరెడ్కో జిల్లా మేనేజర్ పోలిశెట్టి అజయ్ కుమార్



కామేపల్లి, నవంబర్ 5 (భద్రాద్రిన్యూస్): విద్యార్థులు చిన్ననాటి నుంచే విద్యుత్ పొదుపును ఒక అలవాటుగా మార్చుకోవాలని టీజీరెడ్కో జిల్లా మేనేజర్ పోలిశెట్టి అజయ్ కుమార్ అన్నారు. కామేపల్లి మండలం ముచ్చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీజీరెడ్కో ఆధ్వర్యంలో గురువారం ఇంధన పొదుపుపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను ఆదా చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జి వెంకట్ వారితోపాటు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది లు తదితరులు పాల్గొన్నారు

పణితి సూరమ్మ దశదిన కార్యక్రమంలో నివాళులర్పించిన డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళి కృష్ణ



వైరా, నవంబర్ 5,(భద్రాద్రి న్యూస్):
వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ ఏడో వార్డుకి చెందిన పనితీ సూరమ్మ దశ దిన కార్యక్రమంలో గురువారం డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా పనితి సూరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పొదిలి హరినాథ్, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదునూరి సీతారాములు, కౌన్సిలర్ పనితి సైదులు, తేలూరి వీరయ్య, పానెం భాస్కర్, పనితి సురేష్, అంతర కాంగ్రెస్ నాయకులు పాల్గొని పనితి సూరమ్మకి నివాళులర్పించారు.

బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్

- సభలో వక్తగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోట్ట రంగారావు





వైరా, నవంబర్ 5, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ కొనిజర్ల మండలం రామనర్సయ్య గ్రామంలో గురువారం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం దగ్గర సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ అరుణ పథకాన్ని ఆవిష్కరించారు. ముందుగా ఎర్రజెండాలను చేత పట్టి గ్రామంలో ప్రదర్శనగా వెళ్లి అనంతరం సీపీఎంఎల్ మాస్ లైన్ రామ నరసయ్య నగర్ గ్రామ కార్యదర్శి గుగులోతు శివ అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ దేశంలోని పేదల కష్టాలు కన్నీళ్లు తొలగించాలని, తమ జీవితాలను త్యాగం చేసిన కమ్యూనిస్టు అమరవీరుల ఆశయాలను సాధించటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, గత 86 నుండి పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కారణంగానే పేదల మరింత పేదలుగా మారుతున్నారని, దేశంలో నిరుద్యోగం, పేదరికం, వలసలు, ఆకలి చావులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం దేశ సంపదని ప్రజల శ్రమ శక్తిని కారు చౌకగా తాకట్టు పెడుతున్న పాలకులపై పోరాడాలని, నక్సల్బరీ, శ్రీకాకుళం , గోదావరి లోయ ఎప్పుడు ఉద్యమాల పోరాటాల స్ఫూర్తితో ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని, అమరవీరుల పోరాటాల స్ఫూర్తితో, నూతన ప్రజాస్వామ్య విప్లవం లక్ష్యంగా విశాల ప్రజానీకాని చైతన్యవంతం చేయాలని అన్నారు. బిజెపి మోడీ ప్రభుత్వం ఈ 12 సంవత్సరాల కాలంలో మూఢనమ్మకాలను పెంచి పోషించి, దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తూ కులాల మతాల మధ్య చిచ్చు పెడుతూ కమ్యూనిస్టులు, ముస్లింలను, క్రిస్టియన్లను, ఆదివాసి, దళిత గిరిజనులను టార్గెట్ చేస్తూ ప్రశ్నించే వారిని జైల్లో మాయ చేస్తుందని, సర్ పై ప్రధానంగా దేశంలో జరుగుతున్నటువంటి, పరిణామాలను చూసినట్లయితే ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ దేశంలో ప్రధానంగా 13 కోట్ల 40 లక్షల ఓట్లను తొలగించినటువంటి ఘనత జ్ఞానేశ్ కుమార్ కే దక్కుతుందని, ప్రజాస్వామ్య దేశంలో ఓటే ప్రధానమైనటువంటి ఈ దేశంలో ఓటు హక్కును తొలగించే ప్రక్రియ ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్, మోడీ అమిత్ షా కనుసన్నల్లో జరుగుతున్నటువంటి ఓటు చోరీపై ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర జరిగినటువంటి ఆందోళన నిదర్శనమని, ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజా ఉద్యమాల ద్వారా ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, కొయ్యల శ్రీను, కుడుం ఝాన్సీ, వైరా డివిజన్ కార్యదర్శి ఎస్. కె లాల్మియా, పాశం అప్పారావు తడకమళ్ళ సీతారాములు, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, తడకమళ్ళ వెంకన్న, ఉపేందర్, వీరబాబు, వెంకన్న, కోటేశ్వరరావు, రామకృష్ణ, కోటయ్య, పి ఓ డబ్ల్యు జ్యోతి, అప్పమ్మ, గుగులోతు పద్మ, తదితరులు పాల్గొన్నారు.